దానికో దారి చూడమని రోజూ పోరుతుంది పైడమ్మ అంతా విని, వెకిలిగా నవ్వి బయటకు వెళ్ళిపోతాడు వరసయ్య. వీడు పని చేసే రైసుమిల్లు యజమాని నాయుడు. "ఏరా, నీ బొట్టికి సంబంధాలేవైనా చూస్తున్నావా? పిల్ల గుర్రంలా ఎదిగి వుంది" అడిగేవాడు.

"నాకాడ యేముంది దొరా! దాని రాత యెట్టా వుందో అట్టానే జరుగుద్ది." భవబంధాలకు అతీతుడ్ని అన్న ధోరణిలో జవాబిచ్చేవాడు వరసయ్య.

పొద్దు రెండు గంటలు దాటుతూంది. పైడమ్మకు చిన్నాయిని చూస్తుంటే ప్రాణాలు కొట్టుకు పోతున్నాయి. ఆ చిన్న డొక్క యిలా మాడి పోతుందో? సాధారణంగా అందరు తల్లులు లాగే పైడమ్మ ఆలోచిస్తూంది.

"ఒసేవ్ సెంద్రీ! నాయుడుకాడి కెళ్ళి, కుసిన్ని బియ్యం అడిగెట్టా. గంజి కాస్తాను." కూతురు నుద్దేశించి అన్నది పైడమ్మ.

చంద్రి అసహ్యంగా ముఖం పెట్టి, "ఛత్! అడుట్టి యెకిలి నాయాల. మింగేలా సూత్తా, యెదేటో తిమ్మిరి కూతలు కూత్తాడు. నే నెల్లనే" అన్నది.

"అట్టాంటవేటి బిడ్డా! డబ్బున్నోళ్ళ జబ్బే యిది. ఆ కూతల్ని లెక్కసెయ్య మాకు." అనునయంగా అన్నది పైడమ్మ.

ముందు వెళ్ళకూడదని నిర్ణయించుకున్నా, తీరా చిన్నాయి తిండిలేక చచ్చిపోతాడేమోనన్న భయంతో, నాయుడు దగ్గరకు వెళ్ళడానికి ఒప్పుకుంది.

చేట చంద్రి చేతికిచ్చి "బేగె వొచ్చి బిడ్డా" అంది పైడమ్మ.

నాయుడు యింటికేసి అడుగు లేస్తుంది చంద్రి. వయస్సు పొంగుల్ని చూస్తూ, ఈలలు వేస్తున్న అల్లరి మూక ఆగడాన్ని అలవాటుగా భరిస్తూ, బజారు వెంట నడుస్తూంది. నాయుడు యిల్లు అక్కడికి రెండు ఫర్లాంగుల దూరంలో వున్నది. నడుస్తున్న చంద్రి హఠాత్తుగా ఒక బట్టల షాపు ముందు ఆగింది. షోకేసులో రెడిమేడ్ బట్టల జత చిన్న పిల్లలది వుంది. కొట్టు బయట నుండే దాని వెల విచారించగా పది హేను రూపాయలని తెలిసి చంద్రి మనస్సులో రకరకాల ఊహలు చెలరేగాయి. సరిగ్గా ఆ జత చిన్నాయికి సరిపోతుంది. అదేసుకుంటే చిన్నాయి అచ్చం దొరబిడ్డలా గుంటాడు. క్షణ కాలం మురిసిపోయి, లోపల లేమి భావం తలెక్కుమనగా, నాయుడి యింటికేసి భారంగా కదిలింది. నాయుడు బయట నుండే చంద్రిని చూసి గుటకలు మింగుతూ,

"అరే నువ్వటే చంద్రీ! రాయే. రా... యేటిలా వచ్చావ్" శల్యపరీక్ష ప్రారంభిస్తూ అడిగాడు.

"పొద్దుగోల నుండి మా అయ్య పత్తా లేడు. అమ్మ కుసిన్ని బియ్యం అడిగి తెమ్మని నన్ను తోలించింది" తలవంచుకొని చెప్పింది చంద్రి.

"మీ అయ్య కేటే యెక్కడున్నా తాగి తొంగుంటాడు. అదృశేగాని నువ్వేంటే అలా నల్లబడ్డావ్ మీ అయ్య సంబంధాలేవన్నా చూస్తున్నాడా?"

"అయ్యన్నీ యిప్పు డేటికిలే దొరా! కుసిన్ని బియ్యం యిప్పించండి. అనక మా అయ్య కూలీలో పట్టుకోండి."

"హన్నన్న... ఎంతమాటన్నావే... నీ దగ్గర డబ్బులు తీసుకుంటానా?.. సరే అలా నిలబడి పోతావేటే. లోనికి రా. బియ్యం కొలుస్తాను."

లోనికి దారి తీస్తున్న నాయుడిని అనుసరించింది చంద్రి. గాదె దగ్గర ఆగి, "ఒసేవ్ చంద్రీ! నీకున్న అందం, ఏ సినిమా స్టారుకూ లేదే సరిగ్గా పోషణ లేక యిలా వున్నావు గాని, ఆ నిగనిగలు ... ఆ తళతళలు..." వెకిలిగా నవ్వుతూ బుగ్గలు నిమరబోయాడు


"దొరా! బియ్యం యిప్పించండి. యాళవుతోంది. నేపోవాలి" భయంగా చూస్తూ అన్నది చంద్రి.

"ఏటే చంద్రీ యీ బెట్టు. అడిగేకొద్దీ, అందలం ఎక్కుతావ్. యాభై రూపాయలిస్తాను, మాంచి ఛమ్కీ చీర కొనుక్కుందువుగాని. బాగున్నంతవరకు నేర్చుకోవే ఏవీటీ మొగమా?" భుజంమీద చెయ్యి వేసాడు నాయుడు.

ఏదపురు బిగబట్టుకుని, విసురుగా పారిపోయి యింటికి వచ్చింది చంద్రి. నాయుడు తంతు ఈరోజు కొత్త కాదు, చంద్రి కనపడినప్పుడల్లా యిలానే వేధించేవాడు.

ఆశగా ఎదురు చూస్తున్న తల్లిముఖం చూడలేక, జరిగింది చెప్పలేక, నాయుడి యింటికి తాళం వేసుందని చెప్పి, చాప మీద వాలిపోయింది చంద్రి. ఉస్సురని నిట్టూర్చి, చుట్టుపక్కల గుడిసెలకెళ్ళి, వాళ్ళవేత లేదనిపించుకుని చిరాకుగా యింటికివచ్చింది. తిండి లేక నీరసం, పరిస్థితులు ప్రసాదించిన నిస్సహాయత నిప్పులా రాజుకుపోయి, కోపంతో, కసితో యింకా యింటికి చేరని వరసయ్యను తిట్టిపోస్తూంది పైడమ్మ.

సమయం గడుస్తూంది. నెమ్మదిగా చీకటి వీచికలు చుట్టుముట్టుకుంటున్నాయి. ఆ జీమూతంలో జీవచ్ఛవంగా వున్నదా గూడెం సగం గుడిసెల్లోనే



ఆకాశం నక్షత్రాల సముదాయంతో కళకళ లాడుతూంది. హఠాత్తుగా ఒక నక్షత్రంలోని భాగం ఉల్క రూపంలో మండిపోతూ, దిక్కుమాలి, భూమ్మీద విస్పష్టంగా రాలిపోయింది. మిగతా నక్షత్రాలు తమ కేమీ పట్టనట్టు చూస్తూ ఊరుకున్నాయి.

రెండింటికి యింటికి తిరిగి వచ్చింది చంద్రి. దడదడ లాడుతున్న గుండెలతో తడికను తోసుకుని లోపికి వెళింది. ఎదురుగా పైడమ్మ నిప్పుల కురిపిస్తూ, కూతురు జుట్టు పట్టుకుని, ''యాడనుం డొస్తున్నావే బజారు దానా?'' అని అరిచింది

తల్లి అరుపులకు జడిసి, కాస్త తమాయించుకుని, చేతిని విదిలిస్తూ, ''యాడకెళ్తానే ... యేట్నోకి ... జాట్కొదులు' అంది తప్పించుకుంటూ.

జుట్టు ముడిని గట్టిగా పట్టుకు ఊపేస్తూ యేట్నొనుండే వస్తున్నావే కంత్రీముండా! ఇడనే సావక, ఆ బురద నిక్కడెందుకు తెచ్చావే? ఆ ... యేటే ఆ ముడి...'' అని చీర చెంగుకు కట్టిన ముడిని విప్పింది పైడమ్మ. ఐదు పది రూపాయల నోట్లున్నాయి అందులో. అది చూసి, పెను రంకెలు వేస్తూ, ''ఓసి! మాయదారి దానా! ఎంతకి తెగించేవే.'' బండబూతులు తిడుతూ చంద్రిని యెడా పెడా కొట్టడం మొదలెట్టింది పైడమ్మ.

అంతవరకూ తప్పతాగివున్న డబ్బంతా జూదంలో పోగొట్టుకుని, తూలుతూ, ''సిం... సింతపూల రైకదానా...'' అన్న పాటతో గుడిసెలోకి ప్రవేశించాడు నరసయ్య. వాడిని చూడగానే పైడమ్మ కోపం తారస్థాయికి చేరుకుంది. ''ఓరి సచ్చినోడ! ఏం పుట్టుకరా నీది. పిల్లాంబిడ్డలు వున్నారన్న గేనం కూడా నేదు. నీ దినం చెయ్య!'' దులపడం మొదలు పెట్టింది.

వెకిలిగా నవ్వుతూ ''యేందే సిలకా! మంచి వుసారు మీదున్నావ్'' అన్నాడు.

కసిగా నరసయ్యను నాలుగు బాది, ''మాయనారోడా! నీ కూతురెంత పని చేసిందో సూడు – యిదంతా నీ వల్లే వచ్చింది. మగోడవ్వి. నువ్వు నాడెంగా వుంటే యిట్టా ఎందుకు జరుగుద్ది.'' ఆయాసంతో ఆగింది పైడమ్మ.

అంతవరకూ నిద్రాణమైన వాడి మొగతనం అప్పుడు మేల్కొంది.

''యేందేశ్! తెగపేలతుండావ్! యేటి సేసిందేం?'' కోపంతో పిడికెలు బిగిస్తూ అన్నాడు.

''దాన్నే అడక్కపోయావ్! ఎవడితోటో కులికి యాభై రూపాయలొట్టుకొచ్చింది. థూ''

నరసయ్య అవతారం చూసేసరికి దాదాపు స్పృహ తప్పినంత పనయ్యింది చంద్రికి. ఈ గొడవకు చిన్నాయి లేచి భోరుమని ఏడవడం మొదలెట్టాడు

''ఎంత పన్జేసావే...'' బండబూతులు తిడుతూ, గుక్క తిప్పుకోకుండా చితగ్గా తన్ని వదిలి పెట్టాడు. సగం దెబ్బలకే స్పృహ పోగొట్టుకుని ముదగా కిందికి జారి పోయింది చంద్రి.

కాస్సేపటికి నరసయ్య అలిసిపోయి చాప మీద పడుకున్నాడు. ఆ రాత్రంతా పైడమ్మ ఏడుస్తూ కూర్చుంది.

* * *

ఏ మార్పు లేక నమూలుగానే తెల్లవారింది. అనాథలు, శోపహతుల ఉరిపోని ఆశలా సూర్యుడు ప్రకాశిస్తున్నాడు.

మధ్యాహ్నమైనా నరసయ్య చాపమీద నుండి లేవలేదు. గుండెలమీద చేతులుంచుకుని పైకి చూస్తున్నాడు. పైడమ్మ పొయ్యి దగ్గర కూర్చుని ఏదో ఆలోచిస్తూంది. చిన్నాయి కళ్లు తెరవడానికి భయపడి వూరుకున్నాడు. వాడి డొక్కలు ఎగిరిపడుతున్నాయి. చంద్రి ఒళ్ళంతా వచ్చి పుండయ్యింది తడిక కానుకుని గుమ్మంలో కాకుల రొద చూస్తూంది. అంతులేని నిశ్శబ్దం ఆ గుడిసెలో తాండవిస్తూంది. పొగసోకిన వెన్నెల సమయం కరుగుతుంది. అందరూ తప్పు చేసిన వారిలా ఒకరి ముఖాలొకరు చూసుకోడానికి భయపడుతున్నారు. దరిద్ర దేవత వాళ్ళ కనుకూలమైన వాతావరణాన్ని కలిగిస్తూంది. సాయంత్రం గడిచి చీకటి పడుతూంది.

నరసయ్య మెల్లగా కూతురు దగ్గరకు వెళ్ళి, తలమీద చెయ్యి వేసి నిమురుతూ ''అమ్మా సెంద్రీ! కోపంతో నిన్ను గొడ్డును బాదేసినట్టు బాదాను నాను యెగనిని, నెప్పేస్తుందా బిడ్డా. ఛత్! యే ఓటో తిట్టేసినాను అవన్నీ మనస్సులో పెట్టుకోమాకు. యిక మీద యిసుమంటి పనులు సెయ్యమాకేం?'' అని అటూ ఇటూ చూసి.

''మరేం సెంద్రీ! పొద్దుగాల నుండి సుక్కలేక నాలుక యెండిపోనాది. నీకాడ డబ్బులున్నాయిలా వుంది. యిత్తావా?'' కిందికి చూస్తూ చేయి చాపాడు నరసయ్య.

చంద్రి హృదయాంతరాళం నుండి ఒక వికటాట్టహాసం విజృంభిస్తూ పైకి లేచి, అలా.. అలా గొంతులోనే పూడుకుపోయింది. నిట్టూర్పుల నిప్పుల వర్షంలో మసి తూతలకిందున్న పదిరూపాయల నోటును నిర్వికారంగా అందించింది చంద్రి.

నోటును భద్రంగా దాచుకుని, జరిగింది, జరుగుతున్నదీ, జరగబోయేదీ మర్చిపోవడానికై సారా కొట్టు వైపు ఉత్సాహంగా అడుగు లేసాడు నరసయ్య.

